# నవతరం

తెలుగు దినపత్రిక

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 12 | సంచిక : 06 | RNI NO:APTEL/2018/76747 | గురువారం 26 - 02 - 2026 | పేజీలు : 04 | వెల : 01 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor


## జనసేన, బీజేపీతో అందుకే కలిశాం

మార్కాపురం నూతన జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ
- హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ కార్యక్రమంలో చంద్రబాబు
- వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై కలియతిరుగుతూ ప్రసంగం
- వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

గత వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్నిర్మాణం కోసం గత ఎన్నికల్లో ప్రజల సహకారం కోరానని తెలిపారు. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీస్సులు అందుకున్నామని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేటుతో అఖండ విజయం కట్టబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ఒక్క సీటు కూడా వైసీపీకి రాలేదని అన్నారు. 'మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ' కార్యక్రమంలో

2





## ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఏర్పాట్లు
- ఉగాదిలోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలని లక్ష్యం
- సొంత స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం
- మురికివాడల్లో మోడల్ కాలనీల నిర్మాణం.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి ప్లాన్
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3 లక్షల ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం

**తెలంగాణ, నవతరం**

హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండగలోపు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు.

మిగతా 2 లో

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం

ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేశ్ కీలక ప్రకటన

- క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్
- పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

2



## మోదీకి ఘన స్వాగతం

- ఇజ్రాయెల్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికిన నెతన్యాహు
- పలు రంగాల్లో కీలక ఒప్పందాలు చేసుకోనున్న భారత్-ఇజ్రాయెల్

**జాతీయం, నవతరం**

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. టెల్ అవీవ్‌లోని బెన్-గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మోదీకి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా విచ్చేసి, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ఘనస్వాగతం పలికారు. 2017లో తొలిసారి ఇజ్రాయెల్‌లో పర్యటించిన మోదీ, మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఆ దేశ గడ్డపై అడుగుపెట్టడం ఇరు దేశాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టం ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ ను ఉద్దేశించి ప్రసంగించనుండటం. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించబోతున్న మొట్టమొదటి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించనున్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని నెస్సెట్ భవనాన్ని భారత త్రివర్ణ పతాక వర్ణాలతో అలంకరించడం విశేషం. ఈ

2



## రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత నాదే

- ఎస్ఎంఏ టైప్-1 అనే వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక
- 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ సాయం కోరిన తండ్రి
- ఇంజెక్షన్‌కు రూ.16 కోట్లు కావాలని, రూ.10 కోట్లు సమకూరాయన్న తండ్రి
- మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత తనదేనన్న మంత్రి



**ఆంధ్రప్రదేశ్, నవతరం**

ఎస్ఎంఏ టైప్-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. కర్నూలుకు చెందిన బాలిక పునర్విక ఈ వ్యాధితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం మరో రూ.6 కోట్లు అవసరమని, ఆ మొత్తం అందేలా చూసే బాధ్యత తనదేనని 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు. తన కూతురు పునర్విక ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతోందని, చికిత్స

2

## 'డయేరియా' మరణాలపై ధర్మాన ప్రసాదరావు ఫైర్

- కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్న ధర్మాన
- స్టిక్కర్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని విమర్శ
- ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని వ్యాఖ్య



**ఆంధ్రప్రదేశ్, నవతరం**

శ్రీకాకుళం జిల్లాలో ప్రబలిన డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత 20 నెలల కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ

2

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం



- ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్
- విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి
- రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా
- కల్తీ పాలు, డయేరియా ఘటనలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను


2

## ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి మోదీకి ఘన స్వాగతం



గౌరవం ప్రపంచంలోని అతికొద్ది మంది నేతలకు మాత్రమే దక్కుతుంది. పర్యటనలో భాగంగా ఇరువురు నేతలు పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. రేపు జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో ఆర్థిక, భద్రత, రక్షణ, సాంకేతికత, వ్యవసాయ రంగాల్లో కీలక ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతికత బదిలీపై చర్చలు జరగనున్నాయి. మరోవైపు, మోదీ రాకను పురస్కరించుకుని ఇజ్రాయెల్ మీడియా 'నమస్తే.. షాలోమ్' అంటూ ఫ్రంట్ పేజీ కథనాలతో స్వాగతం పలికింది. "మోదీ, నెతన్యాహుల మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం కేవలం ఇద్దరు నేతల మధ్య సంబంధం మాత్రమే కాదు, ఇది రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధం" అని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులతో కూడా సమావేశమై, వారితో సంభాషించనున్నారు.

## ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు



**సొంత స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం**

ప్రస్తుతం సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. గ్రేటర్ పరిధిలో సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, ఈ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

**బహుళ ప్రణాళికలతో ముందుకు**


మురికివాడల్లో నివసించే వారి కోసం "ఇందిరమ్మ మోడల్ కాలనీలు" నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగరానికి దూరంగా ఇళ్లు కేటాయిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో, వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన స్థల సేకరణపై మంత్రులు ఇటీవల అధికారులతో చర్చించారు. వీటితో పాటు, నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు కేటాయించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా జోరుగా పనులు**

ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగంగా సాగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వారిలో 2.50 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత నాదే





కోసం రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆప్షన్‌గా ఉందని, దాని కోసం తాము అన్ని రకాలుగా ప్రయత్నించి ప్రజల నుంచి, దాతల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించామని, మరో రూ.6 కోట్లు అవసరమని పేర్కొంటూ పునర్విక తండ్రి మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై నారా లోకేశ్ స్పందించారు. ఎస్ఎంఐ టైప్-1 అనేది అరుదైన వ్యాధి అని, దీనితో కండరాలు బలహీనపడతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలోనూ పునర్విక పోరాడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె నిజంగా ధైర్యవంతురాలని ప్రశంసించారు. అసాధారణ ధైర్యంతో వ్యాధితో పోరాటం చేస్తోందని అన్నారు. ఆమె ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమని, దాతల నుంచి రూ.10 కోట్లు సమకూరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పునర్విక ఇంజెక్షన్ కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆమె చికిత్స కోసం మిగిలిన రూ.6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సహాయం చేయాలంటూ తన కార్యాలయ 'ఎక్స్' ఖాతాకు అటాచ్ చేశారు. పునర్వికకు సహాయం చేయడానికి మరింతమంది ముందుకు రావాలని కోరారు.

# జనసేన, బీజేపీతో అందుకే కలిశాం





ముఖ్యమంత్రి మాట్లాడారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వంద శాతం గెలిపించాలని కోరారు. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగిస్తూ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారని, మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, అదే ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక్క అడుగు పడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని అన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లమని వెల్లడించారు. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారని, పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని విమర్శించారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడని అన్నారు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేసి మోసం చేశాడని మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరమని, ఇప్పటి వరకు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశామని, మరో రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావని అన్నారు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చానని తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారని మండిపడ్డారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయని అన్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం

సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై




ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటివరకు నిర్వహించిన 1,587 జాబ్ మేళాల ద్వారా 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి కార్మికులను తయారు చేసేందుకు న్యాక్‌ను 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్ సభకు హామీ ఇచ్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేసి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం




ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# 'డయేరియా' మరణాలపై ధర్మాన ప్రసాదరావు ఫైర్

అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయని మండిపడ్డారు. అతిసార వ్యాధితో జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకరు లేదా ఇద్దరే చనిపోయారని అబద్ధపు లెక్కలు చెబుతోందని ధర్మాన ఆరోపించారు. "వాంతులు, విరోచనాలతో ప్రజలు అల్లాడుతుంటే, సహాయం చేయాల్సింది పోయి పోస్టుమార్టం నివేదికలంటూ కాలయాపన చేస్తున్నారు. గత డిసెంబర్‌లోనూ బలగ ప్రాంతంలో ఇలాగే డయేరియా విజృంభించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదు. ప్రస్తుతం 100 మందికి పైగా రోగులు ఆసుపత్రుల పాలయ్యారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదు" అని ధ్వజమెత్తారు. ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రైవేటీకరణ పేరుతో తుంగలో తొక్కారని ధర్మాన విమర్శించారు. రాజధాని పేరుతో డబ్బునంతా ఒకే చోట కుమ్మరిస్తూ, జిల్లాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. సాగుకు యూరియా అందక రైతులు, ఇంగ్లీషు మీడియం చదువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర లేకపోగా, క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించిన ఆయన... ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## లోకేష్ తో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ళ.



(నవతరం -మండపేట) నారా లోకేష్ జిల్లాలు, పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే ల కుటుంబాలతో ఆత్మీయ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోఅమలాపురం పార్లమెంట్ పరిధి ప్రజా ప్రతినిధులతో యువనేత నారా లోకేష్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలసి ఆత్మీయ సదస్సు లో పాల్గొన్నారు. ఉండవల్లి లోని నారా లోకేష్ నివాసంలో ఆత్మీయ సమావేశం చాలా ఆహ్లాదకర వాతావరణం లో సాగింది. ఈ కార్యక్రమంలో లోకేష్ ప్రజా ప్రతినిధులతోనూ వారి కుటుంబ సభ్యులతోనూ ఎంతో సరదాగా మాట్లాడుతూ పేరుపేరునా వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ ఎమ్మెల్యే వేగుళ్ళతోను, వేగుళ్ళ పెద్ద కుమార్తె మణిమంజరి, అల్లుడు సురేష్ కుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు.

## రోడ్లు డ్రైనేజి ల నిర్మాణం పనులు పర్యవేక్షించిన బీజేపీ నాయకులు.



(నవతరం-మండపేట) కేంద్ర ప్రభుత్వ విబి-జి రాంమ్ జీ పథకం నిధులతో నిర్మాణం జరుగుతున్న సిమెంటు రోడ్లు సిమెంటు డ్రైనేజీల నిర్మాణ శైలిని భారతీయ జనతా పార్టీ నాయకులు పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడి వేములపల్లి బంగారమ్మ కాలనీలో నిర్మాణం అవుతున్న సిమెంట్ రోడ్లు డ్రైనేజీలు పనితీరును పరిశీలించారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరాం కోకన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు పాలిక రమణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాయి వీర్రాజు, ద్వారపూడి బిజెపి అధ్యక్షులు నీల సత్యనారాయణ, దూలం శ్రీనివాసు, గుత్తుల సత్యనారాయణ, పసుమర్తి శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష కు మండపేట లో కేంద్రం.



(నవతరం-మండపేట) ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్ పరీక్ష పాలిసెట్-2026 కు మండపేట ను పరీక్ష కేంద్రం గా ఎంపిక చేసినట్లు అనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.వి.వి.ఎల్. సత్యనారాయణ, సెంటర్ కో ఆర్డినేటర్ , మెకానికల్ ఇంజనీరింగ్ శాఖాధిపతి డి.వి.యస్.యస్. ఎన్.వి. ప్రసాద్ బాబు లు తెలిపారు. మండపేట ఏడిద రోడ్ లోని శ్రీ వేగుళ్ళ సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.ఏప్రిల్ 25 ఉదయం 11.00 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష ఉంటుంది. పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## మండపేటలో భారీ వర్షం. పల్లపు ప్రాంతాలు జలమయం.



(నవతరం-మండపేట) తూర్పు గోదావరి జిల్లా మండపేట లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండపేట , ద్వారపూడి, రూరల్ మండలం గ్రామాల్లో ఈదురు గాలులు తో వర్షం పడింది. కేశవరం లో భారీ వర్షం కురిసింది. మండపేట లో వర్షం వలన డ్రైన్ లలో నీరు రోడ్ పై ప్రవహించింది. ద్వారపూడి లో డ్రైన్ లు మూసుకొని పోవడం తో రోడ్ మీద నీరు నిలిచిపోయింది. మండపేట లో పలు ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్ పై ప్రవహించింది. ఇక ఇప్పుడిప్పుడే మామిడి చెట్లు కు పూత పుస్తువుంది. ఈ గాలులకు పూత మొత్తం రాలిపోయింది. ఇది ఈ ఏడాది మామిడి దిగుబడి పై ప్రభావం చూపనుందని రైతులు చెబుతున్నారు. వర్షం గాలులు కారణంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునద్ధరణకు విద్యుత్ సిబ్బంది కృషి చేశారు. పలు చోట్ల విద్యుత్ వైర్లు పై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

# అవసరమైన యాంటీడోట్ ఇంజెక్షన్ అందుబాటులో

**నేడు చేపట్టిన ఇంటింటి సర్వేలో కొత్తగా కేసులు నమోదు కాలేదు: కలెక్టర్ కీర్తి చేకూరి**

(నవతరం - రాజమహేంద్రవరం ) కలుషిత పాలు కారణంగా వైద్య సహాయం అవసరమయ్యే రోగులకు అవసరమైన యాంటీడోస్ ఇంజెక్షన్ అందించడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ డా. రవి రాజు సూచనల ప్రకారం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఈ ఇంజెక్షన్ ఉపయోగించవచ్చు అని తెలియ చేశారు. రాష్ట్రంలో మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇది అందుబాటులో లేకపోవడంతో, సంబంధిత ఏజెన్సీల ద్వారా ప్రత్యేకంగా తీసుకు రావడం జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

**ఇంటింటి పర్యవేక్షణ (House-to-House Surveillance) ఫలితాలు** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, ప్రభావిత ప్రాంతాలలో కలుషిత పాలు వినియోగించిన కుటుంబాల కోసం విస్తృత ఇంటింటి పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. ఆర్ ఎమ్ సి కమిషనర్ రాహుల్ మీనా ప్రత్యక్ష పర్యవేక్షణలో 9 వైద్య బృందాలు పాల్గొని, మొత్తం 110 కుటుంబాలు, 307 మంది ప్రజలపై సమగ్ర విచారణ చేపట్టామన్నారు. లాక్ చేసిన ఇళ్లు: 6 (ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు ఎటువంటి లక్షణాలు లేవని గుర్తించబడింది). నేడు డోర్ టూ డోర్ సర్వే లో కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. కుటుంబ సభ్యులకు పాలు మరియు పాల ఉత్పత్తులు వినియోగించకుండానే సురక్షితంగా పారవేయాలని సూచనలు చేశామన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించి నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు గమనించినట్లయితే వెంటనే నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్ ను సంప్రదించమని లేదా ఫోన్ నెంబర్ "94940 60060" ద్వారా సమాచారం అందుకోవచ్చుననీ తెలిపారు.

# ద్వారపూడి లో పర్యటించిన ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం.





(నవతరం-మండపేట) తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఆర్టీసీ అద్దె బస్సులు రావడంలేదని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ద్వారపూడి గ్రామానికి చెందిన బిజేపి నాయకులు కంకటాల మురళీకృష్ణ గతంలో పలు సార్లు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఇచ్చిన లేఖ పట్టుకుని అనేకసార్లు విజయవాడ వెళ్లి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్, జోనల్ ఈ డి. విజయరత్నం ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ క్రమంలో విజయవాడ నుండి ఆర్టీసీ ఉన్నతాధికారి శివరాం, కాకినాడ జిల్లా రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, రాజమండ్రి జిల్లా రీజనల్ మేనేజర్ వై యస్ ఎన్ మూర్తి,రావులపాలెం డిపో మేనేజర్ కుమార్, కాకినాడ డిపో మేనేజర్ మనోహర్,రాజమండ్రి డిపో మేనేజర్ మాధవ్, రామచంద్రపురం డిపో మేనేజర్ల లు బృందం ద్వారపూడి విచ్చేశారు. ఆర్టీసీ అద్దె బస్సుల యూనియన్ అధ్యక్షులతో కలిసి వచ్చారు. అద్దెబస్సు యాజమాన్యం తో చర్చించి త్వరగతిన గ్రామంలోనికి ఆర్టీసీ అద్దె బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు సత్తి సత్యనారాయణ, జనసేన గ్రామ అధ్యక్షులు చింతా దొరబాబు, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, సలాది బాలసుబ్రహ్మణ్యం, గోణం పుల్లయ్య, అడబాల బుల్లబ్బులు, నాయుడు డాక్టర్, తామల్ల రాజు, దాట్ల కృష్ణంరాజు, నక్క శ్రీనివాసు,బడుగు వెంకటేశ్వరరావు, బిజెపి జనసేన తెలుగుదేశం పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు కు ప్రారంభోత్సవం చేసింది నేనే

## పూర్తి చేసేది నేనే – ముఖ్యమంత్రి చంద్రబాబు





నవతరం గిద్దలూరు ప్రతినిధి 25 ఫిబ్రవరి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించారు. మొదటిగా వెలుగొండ ప్రాజెక్టుకు కీలకమైన ఫీడర్ కెనాల్ మరమ్మత్తులకు 456 కోట్ల రూపాయలతో దోర్నాల మండలంలోని గంటవానిపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కాపురం పట్టణంలో తర్లుపాడు రోడ్లో సాయి బాలాజీ స్కూల్ ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు అప్పుడు శంకుస్థాపన చేసింది నేనేనని ఈ ఏడాది జులై నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తానని అన్నారు. 2019 ఎన్నికల్లో వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని నియోజకవర్గాలలో ఒక్క నియోజకవర్గంలో కూడా ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించలేదని కానీ అదే ప్రజలు గత ఎన్నికల్లో రెండు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కుల, మతాలకతీతంగా ఈ అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పడిన మార్కాపురం నూతన జిల్లా కార్యాలయాల ఏర్పాటు కోసం అప్పటికప్పుడే 50 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. దీంతో ప్రజల హర్షద్వానాలు నిన్నంటాయి. అంతకుముందు ప్రసంగించిన మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటారని అన్నారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని చెరువును ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేయుటకు 25 కోట్ల రూపాయలు అవసరమని అభ్యర్థించారు. అత్యంత కీలకమైన మార్కాపురం, తర్లుపాడు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయుటకు 15 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ముఖ్యమంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో మిర్చి రైతులు ఎక్కువగా ఉన్నారని కావున ముఖ్యమంత్రి దయుంచి మార్కాపురం పట్టణంలో మినీ మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలంను వెలుగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి తేవాలని అభ్యర్ధించారు. అత్యంత వెనుకబడిన మార్కాపురం నియోజకవర్గంలో గ్రామాల్లో సీసీ రోడ్లను పూర్తి చేయుటకు 76 కోట్ల రూపాయలు అవసరమని వాటిని మంజూరు చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, డోల బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు మరియు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, దామచర్ల సత్య, పెందుర్తి వెంకటేష్, మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమా మహేశ్వరరావు, మార్కాపురం జిల్లా కలెక్టర్, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్, మార్కాపురం జిల్లా ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు స్టేషనులో తనిఖీలు నిర్వహించిన ఐజి. జివిజి అశోక్ కుమార్






( నవతరం - ఐ పోలవరం ) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరంలో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు ఈ ప్రాంతం యానాం సరిహద్దులో ఉండటం వల్ల మద్యం, పెట్రోలు,డీజిల్ స్మగ్లింగ్ జరుగుతూ ఉంటుంది వీటిని పూర్తగా అరిడతాం.అలాగే ఈ ప్రాంతం హైవే ప్రాంతం కావడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ అధికంగా ఉండే పాత ఇంజరం – ఎదుర్లంక బ్రిడ్జి, కొమరగిరి ప్రాంతాలను ప్రమాదకరమైన 'బ్లాక్ స్పాట్స్'గా గుర్తించారు. గత మూడేళ్లలో ఇక్కడ 24 మంది మరణించగా, ప్రమాదాల తగ్గింపునకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాము.మరొక ముఖ్య విషయం గోదావరినదిలో దూకి చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు, గోదావరి వంతెనపై ఆత్మహత్యలను నిరోధించడానికి 52 సీసీ కెమెరాలు,మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేశాము.అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందు కు పెట్రోలింగ్ మరియు అవగాహన బోర్డులను ఏర్పాటు చేస్తున్నాము. చిన్న పిల్లలపై అఘాయి త్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి, సస్పెక్ట్ షీట్లు తెరిచాము పేదరికాన్ని ఆసరాగా చేసుకుని జరిగే ఇటు వంటి నేరాల పట్ల విద్యార్థులకు,తల్లి దండ్రులకు అవగాహన కల్పిస్తున్నాము. గంజాయి స్మగ్లింగ్ ను పూర్తిగా అడ్డుకున్నాము. గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట జిల్లా ఎస్.పి రాహుల్ మీనా, అమలాపురం డి.ఎస్.పి టి.ఎస్.ఆర్.కె ప్రసాద్. ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్, స్థానిక ఎస్.ఐ సిబ్బంది పాల్గొన్నారు,

# ప్రకృతి వ్యవసాయానికి కొత్త ఊపునిచ్చిన కొనుగోలు దారులు







(నవతరం- రాజమహేంద్రవరం) రాజమహేంద్రవరం లో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై స్థానిక జె ఎన్ రోడ్డు లోని (సూర్య గార్డెన్స్) కొనుగోలు దారులు -- విక్రేతల అనుసంధాన సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలియ చేశారు. అందుకు అనుసరించి తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్, కొనసీమ, కృష్ణా, కాకినాడ (డెల్టా ప్రాంతం) జిల్లాలకు చెందిన దీ=జ (బయో రిసోర్స్ సెంటర్) ఉత్పత్తులు మరియు ఇన్‌పుట్‌ల స్టాల్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, డెల్టా ప్రాంత రైతులు, అగ్రిగేటర్లు, ప్రాసెసర్లు, రిటైలర్లు మరియు సర్వీస్ ప్రొవైడర్లు పరస్పర అనుసంధానం కావడానికి ఈ సమావేశం వేదికగా నిలిచిందన్నారు. రైతు ఉత్పత్తులకు ప్రత్యక్ష మార్కెట్ కల్పించడమే లక్ష్యంగా ఈ నెట్‌వర్కింగ్ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన రహిత, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను వినియోగ దారులకు అందించవచ్చని ఆమె తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ రంగంలో ఉత్పత్తి మాత్రమే కాకుండా మార్కెటింగ్ వైపు కూడా దృష్టి సారించాలని సూచించారు. రైతు నుండి వినియోగదారుడికి నేరుగా అనుసంధానం ఏర్పడితే రైతు ఆదాయం గణనీయంగా పెరుగు తుందని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్య పరిస్థితుల్లో కూడా మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ముందడుగు వేసి ప్రకృతి వ్యవసాయాన్ని స్వీకరిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతు స్వావలంబన సాధిస్తారని, సమాజానికి ఆరోగ్యభద్రత కల్పించగలమని పేర్కొన్నారు. ప్రతి రైతు ఒక మార్పు దూతగా మారి, తన పొలంలో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయాన్ని పక్క రైతులకు కూడా పరిచయం చేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం అనేది కేవలం పంటల ఉత్పత్తి కాదు -- ఇది భూమి, మనిషి మరియు ప్రకృతి మధ్య సమతుల్యతను నిలబెట్టే సుస్థిర జీవన విధానం అని ఉద్ఘాటించారు. మాజీ స్పెషల్ ప్రధాన కార్యదర్శి / రైతు సాధికార సమితి కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు, టి. విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్) జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొని రైతులు, వ్యాపారవేత్తలు మరియు కొనుగోలు దారులతో ప్రత్యక్షంగా సంభాషించడం జరిగింది. విత్తనం నుండి పంట కోత వరకు ప్రకృతి వ్యవసాయ విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. భూమి ఆరోగ్యం కాపాడుతూ స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తులు పండించడంలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఇది కేవలం ఒక పద్ధతి మాత్రమే కాకుండా రైతు జీవన విధానంలో సానుకూల మార్పు తీసుకువచ్చే ఉద్యమమని వివరించారు. రసాయనాల అధిక వినియోగంతో భూమి సారవంతత తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రకృతి వ్యవసాయం భూమికి మళ్లీ జీవం పోసే సాధనమని తెలిపారు. జీవామృతం, ఘనజీవామృతం, వృక్ష కషాయాలు వంటి సహజ పద్ధతుల ద్వారా నేలలోని సూక్ష్మజీవులను సంరక్షించి, భూమి ఉత్పాదకతను దీర్ఘకాలికంగా పెంచుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, దిగుబడులు స్థిరంగా లభిస్తాయని, మార్కెట్‌లో రసాయన రహిత ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ రైతుకు మెరుగైన ఆదాయాన్ని అందిస్తుందని వివరించారు. భూమిని తల్లిలా భావించి దానిని రక్షించడం ప్రతి రైతు బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేల మరియు స్వచ్ఛమైన ఆహారం అందించడం మనందరి కర్తవ్యమని స్పష్టం చేశారు.

**రైతుల అనుభవాలు** ఠైతులు సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, మల్లికార్జునరావు తమ ప్రకృతి వ్యవసాయ అనుభవాలను వివరించారు. ఇతర రైతుల నుండి ఉత్పత్తులు సేకరించి వ్యాపారవేత్తలుగా ఎదిగిన విధానాన్ని తెలియజేశారు. రాంబాబు తన వద్ద దేశీ వరి, మిల్లెట్స్, పండ్లు, బెల్లం, తేనె తదితరంగా 40--45 ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, ప్రతి రైతు ఉత్పత్తి దశతో పాటు మార్కెటింగ్ దశలోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. రైతు ఒక ఉత్పత్తిదారుడిగానే కాకుండా వ్యాపారవేత్తగా కూడా ఆలోచించే దిశగా ముందుకు రావాలని పేర్కొన్నారు. ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు వ్యవసాయ శాఖ నుండి సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణా కార్యక్రమాలు, మార్కెటింగ్ అనుసంధానం, ప్రభుత్వ పథకాల ద్వారా పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. రైతులు సమూహాలుగా ఏర్పడి పనిచేస్తే ప్రభుత్వ సహకారం మరింత సమర్థవంతంగా అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు సి. చంద్రశేఖర్ (ఝూ), ప్రణయ్ భార్గవ్ (సీనియర్ కన్సల్టెంట్ – – జుణూ), బిజయ్ నరసింగ్ దేవ్ (ఝా), అలాగే జిల్లా అధికారులు కె. రాబర్ట్ పాల్ (డీఏఓ), మల్లికార్జునరావు (డీహెచ్‌ఓ), చక్రధర్ (డీడీఎం -- నాబార్డ్), ఎం. సునిల్ వినయ్ (ఏడీ మార్కెటింగ్), తూర్పు గోదావరి జిల్లా డీపీఎం తాతారావు, డెల్టా జిల్లాల డీపీఎంలు వెంకటేష్, నూకరాజు, ఎలియజార్, శ్రీనివాసరావు, శంకర్ నాయక్, ప్రకృతి వ్యవసాయ రైతులు, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు ప్రాజెక్ట్ మేనేజర్ లు తదితరులు పాల్గొన్నారు.















# జర్నలిస్ట్ సతీష్‌కు కొత్తపేట ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ చేయూత

*రూ.27 వేల ఆర్థిక సాయం అందజేత, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సభ్యులు.*





(నవతరం- రావులపాలెం ) అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ గంధ్రోతు సతీష్‌కు ది కొత్తపేట నియోజకవర్గ నూతన ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటారు. సభ్యుల సహకారంతో బుధవారం రావులపాలెం మండలం ఈతకోటలో సతీష్‌ను పరామర్శించి రూ.27,000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, మీడియా అంటే కులమతాలకు అతీతంగా అందరూ ఒకే కుటుంబ సభ్యులుగా ఉంటామని, తమలో ఎవరికైనా ఆపద వస్తే అందరం కలిసి సహాయం చేసుకుంటామని అందులో భాగంగానే తోటి మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలుసుకొని తమవంతుగా సాయం అందిస్తున్నామని, తొందరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి తన వృత్తిలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. అదే విధంగా అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు రావులపాలెం సి.ఆర్.సి సంస్థ కార్యవర్గ సభ్యులు స్పందించి రూ.25,000 ఆర్థిక సహాయం అందించింది. సి.ఆర్.సి పాలకవర్గ సూచన మేరకు మేనేజర్ వీరభద్రరావు అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఈ మొత్తాన్ని సతీష్‌కు అందజేశారు. సతీష్ కుటుంబ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు సి.ఆర్.సి కార్యవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతకు ఇది నిదర్శనమని పలువురు తెలిపారు.

# జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు రజని పర్యటన

**కొత్తపేట మండలంలో పాఠశాలల సందర్శన**
**విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, భద్రతపై అవగాహన.**





(నవతరం- కొత్తపేట) పుణ్యమంతుల రజిని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు, మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సోమవారం కొత్తపేట మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించి పలు సూచనలు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండల గవర్నమెంట్ బాలుర, బాలికల హైస్కూల్‌లతో పాటు అంబాజీపేట మండలం తొండవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల చదువు, పాఠశాల వాతావరణం, ముఖ్యంగా బాలికల భద్రతపై తీసుకుంటున్న చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో గానీ, బయట గానీ జరిగే ప్రతి విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలని తెలిపారు. చిన్నారులు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు పెరుగుతుండటం ఆందోళనకరమని, ఇటువంటి ఘటనలను నివారించేందుకు చట్టాలతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరమని వివరించారు. విద్యార్థినీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని గుడ్ టచ్ -- బాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పదో తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట బాలుర, బాలికల పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, కోరుకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



( నవతరం-కొత్తపేట) పేద, మధ్యతరగతి వర్గాల్లో అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించని వర్గాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సీ.ఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని యువనాయకులు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులను అందజేశారు. అనంతరం సంజీవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో మన నియోజకవర్గం లో అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొత్తపేట మండలానికి చెందిన 56 మందికి రూ.23,50,326లు విలువైన చెక్కులు అందజేశారు.

Printed by SIRIGIRI VARADARAJU and Published by SIRIGIRI VARADARAJU on behalf of SIRIGIRI VARADARAJU,and Printed at: Kanthi Publications, Door No:2-504/1,Adityanagar colony,Arasavalli, Srikakulam, Andhra Pradesh State,532401, India,Printed and Published and Owned by SIRIGIRI VARADARAJU Door No:18-11-12/1,Krishnanagar, Rajamahendravaram,East Godavari